కథా నిలయం
1462
శ్రీకాకుళం

# ఆకాశాత్ పతితం తోయమ్...

ఉదయం నిద్రలేచిన వెంటనే న్యూస్‌పేపర్ చదవకపోతే రాత్రంతా సుఖంగా నిద్రపట్టినా మనసుకు కులాసాగా వుండదు, సత్యానందానికి. నిజానికి న్యూస్‌పేపర్లో వార్తలకన్నా వెనక పేజీల్లో వుండే క్రాస్‌వర్డ్ పజిల్ ఎక్కువ ఆకర్షణ అతనికి.

పత్రికలో శీర్షికలు, సంపాదకీయం, ముఖ్యమైన వార్తలు అయిదారు నిమిషాలలో చూసేసి పజిల్ ముందు చేతిలో బాల్‌పాయింట్ పెన్‌తోసహా సెటిల్ అయిపోతాడు.

'జీవితంలో యేమీ సమస్యలు లేనట్లుగా ఎందుకయ్యా నీవు ఎప్పుడూ ఈ క్రాస్‌వర్డ్ పజిల్స్ ముందు వేసుకు కూర్చుంటావు?' అని స్నేహితులు అతన్ని అప్పుడప్పుడూ మాటలు అంటూ వుంటారు. సత్యానందం దృష్టి వేరు. జీవితంలో అనుదినం ఎదురయ్యే సమస్యలు సమంజసంగా సజావుగా పరిష్కారం చేసుకోవాలంటే ఇలాంటి ఊహాజనితమైన 'పజిల్స్' సాల్వ్ చెయ్యడం బాగావచ్చివుండడం అవసరం అని అతని దృఢమైన అభిప్రాయం.

జీవితం అంటే ఏమిటి?

రహదారులు కొన్ని నిలువుగాను, కొన్ని అడ్డంగాను పోతూవుంటాయి. ఎవరో కొంటెమనిషి అన్నట్లుగా 'ఈ రోడ్డు ఎక్కడికీ పోదు, ఎప్పటికీ యిక్కడే వుండిపోతుంది'. కాని దీనిమీద లక్షలాది- కోట్లాది మనుష్యులు నడిచివెళతారు. ఈ రోడ్డే తమను మరోచోటుకు తీసుకువెడుతున్నంతగా ఆనందిస్తారు, మురిసిపోతారు.

అలాగే జీవితంలోనూ ఎన్నో రహదారులు.

కొన్ని నిలువుగా వుంటాయి. కొన్ని అడ్డంగా వుంటాయి. వాటి స్వరూపం యేమిటో తెలుసుకుని సజావుగా ప్రయాణం చేయడం తప్ప ఇంకొక పరిశ్రమ అక్కర్లేదు మనిషికి.

జీవితంలో యేదో అయిపోదామని, అసాధ్యం అయిన దానిని తప్పని

సరిగా సాధించాలని దురాశలు, అపోహలు లేవు సత్యానందానికి. జీవితం కూడ మనచుట్టూ పరచుకున్న రహదారుల వంటిదే. దీనిమీద యెటుగా ప్రయాణం చెయ్యాలన్న విషయం ఎవరికివారుగా ఎన్నుకోవటానికి అవకాశం ఉంది. అలా ఎన్నుకోవటానికి అనువుగా కొన్ని ఆధారాలు ఉన్నాయి. ఆధారాల దారాలు పట్టుకుని సునాయాసంగా ముందుకుపోయేవాళ్ళువున్నారు; ఈ దారాలను చిక్కు చేసుకుని ముడులు, పీటముడులు తయారుచేసుకునే వాళ్ళు ఉన్నారు. అందుకు ఎవరెవరినో నిందించుకుంటూ, ఈ క్లిష్ట పరిస్థితి నుంచి కాపాడమని వేడుకుంటూ కాలక్షేపం చేసేవాళ్ళూ ఉన్నారు.

ముక్కు మూసుకుని సూటిగా వెళ్ళిపోవటానికి లేదు జీవితంలో. పక్క దారులనుంచి యెవరెవరు వచ్చి ఢీకొంటారో, పల్టీలు కొట్టిస్తారో గమనిస్తూ జాగ్రత్తగా చూచుకుంటూ నడవాలి. క్రాస్‌వర్డ్ పజిల్‌లోనూ అంతే. ఒక ఆధారానికి తగిన సమాధానం దొరికిందిగదా; స్ఫురించింది గదా అని వెంటనే గడులు పూర్తిచేయటానికి లేదు. ఆ మాటకు అడ్డుగా తగిలే రహదారులలో పరుచుకుంటూ వచ్చే యితర మాటలకు- పొంతన కుదరాలి. ఆధారానికి 'అర్థం' సరిపోయిందనుకుంటే చాలదు, యితర అనర్థాలు యేవీ ఎదురు రాకుండా 'పరమార్థం' ఓనగూడేటట్లుగా వుండాలి. అప్పుడే గళ్ళల్లో అక్షరాలన్నీ సజావుగా నిండిపోయాయి. జీవితానికి పరిపూర్ణత వస్తుంది.

'నీవు అన్నిటినీ ఫిలాసఫైజ్ చేస్తావు- అంతా వేదాంతం!' అంటారు సత్యానందాన్ని తెలిసిన వాళ్ళందరూ.

అలా చేయకపోతే అసలు జీవించడం ఎందుకో తెలియదు అతనికి.

'ఆలోచించకుండా ఏపనీ చేయకు'- అని చిన్నప్పుడు బడిలో నేర్చుకున్నాడు అతను. అందుకని సరోజదళనేత్రి, హిమగిరిపుత్రి 'పార్వతి' వచ్చి 'మనమిద్దరం పెళ్ళిచేసుకుందాం' అన్నప్పుడు వెంటనే బుర్రపూస లేదు. ఈ పెళ్ళివల్ల తమ జీవితాలకు నిజంగా 'సుఖం' కలుగుతుందా, అన్నివిధాల 'ఆనందదాయకం' అవుతుందా- అని ఆలోచించడం మొదలుపెట్టాడు.

ఆఖరుకు పార్వతి అన్నది కూడా, 'వనిత తనంత తావలచి వచ్చినప్పుడు మీ మగవాళ్ళ ఎప్పుడు ఆదరించారులే' అని. ఇంకా 'స్త్రీ హృదయాన్ని చదవడం యెప్పటికయినా ఈ మగజాతికి అర్థంఅయి యేడుస్తుందా?' అనీ!

తనలో యేదో లోపం– అలస్యం- కాకపోతే కాస్త నిదానంగా ఆలోచించిగాని ఏమీ నిర్ణయం తీసుకోలేని ఉదాసీనత- ఉన్నంతమాత్రాన పార్వతి తన మూలకంగా 'మగజాతి'ని యావత్తూ దుయ్యబట్టటానికి ప్రయత్నించడం సత్యానందానికి ఎంతమాత్రం రుచించలేదు. ఆ అమ్మాయి అభిప్రాయం ఎలా వున్నా, పెళ్ళిచేసుకోవటానికి అవసరమైన ఆత్మీయత ఏర్పడకుండా పోయింది అతనికి.

"నన్ను క్షమించు. నేను కాస్త ఆలస్యం మనిషిని. ఒంటరిగా వుండిపోవడమే నా బుద్ధికి లక్షణంగా తోస్తోంది" అన్నాడు అతను.

ఆమె అయిష్టంగానే మరో వరుడిని ఎన్నుకుంది. ఆఖరు అస్త్రంగా సత్యానందంతో "డబ్బును చూచి నువ్వు ఎందుకు యింత భయపడతావో నాకు తెలీదు" అంది.

"డబ్బును చూస్తే నాకేం భయంలేదు. డబ్బును ఉపయోగించే మనుషుల పద్ధతి చూస్తేనే భయం" అనుకున్నాడు సత్యానందం మనసులోనే.

ఆ మాటలు పైకి అంటే పార్వతి యింకా వాదోపవాదాలు మొదలుపెట్టి పెడర్థాలు తీసి వేధించుకు తింటుందని ఊరుకుండిపోయాడు.

డబ్బు ఉన్నది గనుక నాకేం ఫరవాలేదు. ఏమయినా చేయగలను. ఏం కావాలనుకున్నా సాధించగలను ... అనే మనస్తత్వం సత్యానందానికి సుతరామూ అర్థం కాదు.

ఇన్నాళ్ళ తరువాత సత్యానందం పార్వతిని కలుచుకున్నప్పుడల్లా తన అభిప్రాయాలు మార్చుకోవలసి రాకపోవడం విచిత్రం అనిపించదు. అభిప్రాయాలను తమలపాకులలాగ నమిలి తినేసే మనిషి అతను. జీర్ణం అయిపోతాయి తేలికగా. అజీర్తి చేసి బాధపెట్టవు.

పార్వతి జీవితంలో యిమడలేక.... భర్తతో పొందికగా రోజులు గడపలేక నానాఅవస్థలు పడుతూవున్న రోజులలో ఆమెకు ఆ దుస్థితి తనద్వారా రానందుకు, ఆమె భర్త స్థానంలో తనువుండి అసౌకర్యాలు పడనందుకు తననుతాను అభినందించుకున్నాడు. "నేను పిరికివాడినని అందరూ అనుకోవచ్చును. కాని కాదు. జీవితంలో రహదారులు సరిగా, నిటారుగా లేనప్పుడు పక్కకుతప్పుకోవడం ఎలాగో తెలిసినవాడినిఅంతే" అనుకున్నాడు.

అంతటితో అయిపోలేదు.

సానుభూతితో అర్థం చేసుకోకుండా జీవితం మనకు యేదోఅన్యాయాలు చేస్తోంది అనుకుంటారు అందరూ. పాపం జీవితం ఏంచేస్తుంది? రహదారిలో ముళ్ళకంపలు పనివేళా తీసుకువచ్చి పడేసేవాళ్ళు వేరే వున్నారు. దానికోసం జీవితాన్ని నిందించి ఏం లాభం? అనుకుంటాడు సత్యానందం.

ముళ్లకంప ఎదురయినప్పుడు కాస్తపక్కకు తప్పుకుంటే పోయేదానికి యింత రాద్ధాంతం ఎందుకు?

చదువుల సరస్వతి- చక్కదనాలకు ఏమీ తీసిపోనిది అయిన గిరిజను వివాహం చేసుకుని జీవిత భాగస్వామ్యం యిద్దామని సత్యానందం అనుకున్న మాట నిజమే. గిరిజకు చదువుమీద వున్న అపేక్ష యింకే యితరవ్యాసంగం మీద లేదు పుస్తకాలను గురించి ఆమె సంపాదించుకున్న జ్ఞానం అతడిని అక్కజ పరచడమే కాకుండా అతి ముగ్ధుడినీ చేస్తుంది.

గ్రంథాలయాలలో యెన్నో పుస్తకాలు వున్నాయి. అయినా ఇంకా యే పుస్తకాలు లేకపోవడం "లోపమో" గిరిజ తీరుబాటుగా చెప్పగలదు.

పుస్తక దుకాణాలలో ఎన్నోరకాల పుస్తకాలు పేర్చి అమర్చివుంటాయి. కాని గిరిజ అడిగే విషయాలమీద పుస్తకాలు మాత్రం యే దుకాణదారూ వెనువెంటనే 'సప్లయ్' చేయలేడు

ఎన్నో పుస్తకాలు వున్నట్లుగా కనిపిస్తాయి, కాని సమగ్రమైన పుస్తకాలు లేవు. ఒక విషయాన్ని కూలంకషంగా తెలుసుకోవాలంటే ఏ పుస్తకంచదివితే సరిపోతుందో తెలియకుండాపోతుంది. 'అసలు పుస్తకాలు' యేవో, నాలుగు పుస్తకాలు చూచి అయిదోదిగా తయారుచేసిన పుస్తకం యేదో తెలియకుండా పోతోంది- అంటుంది ఆమె.

అంతేకాదు. గిరిజ యే మనిషినయినా పుస్తకంలాగ చదివేయగలదు. అతడు నాలుగయిదు మాటలు దొర్లించేసరికి, అతని లక్షణాలు, గుణగణాలు యేకరువు పెట్టేస్తుంది. 'మనిషిని పుస్తకంలాగ చదవడం ఆమెకు చేతనవును' అనుకున్నాడు సత్యానందం. అలాంటి మనుషులముందు అంతరంగం, బహిరంగం అని రెండుపక్కలు వుండవు జీవితానికి. బొమ్మ-బొరుసు వుండవు నాణేనికి. ఒకటే వస్తువు. అందుకే భయపడిపోయాడు- తన ప్రతిపాదన మాటలలో పెట్టటానికి

ఇప్పుడు- జీవితంలో బహుదూరంవచ్చేశాక, వెనక్కు తిరిగిచూసుకుంటే

పోనీ అలా చూచుకోకుండానే వర్తమానాన్ని గమనిస్తే గిరిజ జారిపడిన హిమ బిందువుగానే గోచరిస్తుంది. నీటిచుక్క ఆవిరి అయిపోవడం. మణిలాగ రూపు కట్టుకోవడం- రెండూ సాధ్యమే! గిరిజ ఈ రెంటిలో ఏమయినట్లో సత్యా నందానికి ఎంత ఆలోచించినా అర్థం కాదు.

గిరిజను పెళ్ళి చేసుకున్నతను, "అదో పుస్తకాల పురుగండీ! మీరు చేసుకోకపోవడంవల్ల నాకు తప్పలేదు, ఏం చెయ్యను?" అన్నప్పుడు సత్యా నందం మనసులోనే విలపించాడు. "జ్ఞానాన్ని గౌరవించడం చేతకానిమనిషి" అనుకున్నాడు అతడిని. వెంటనే స్ఫురణకు వచ్చింది. తను మాత్రం యేం చేశాడూ? గౌరవించి తలలో పెట్టుకున్నాడు గనుకనా!

దేశ దేశాలకు వెళ్ళి తన జ్ఞానసంపదను ఇతరులతో పంచుకుంటుంది గిరిజ ఆమెకు ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రతిష్ఠలు వున్నాయి. కాని అవేవీ భర్తకు అక్కర్లేదు గణనీయంగా కనిపించవు. పెద్ద పదవి, పురస్కారం మనిషికి వుంటేనేం? 'పురుగు'లాగానే చూడగలుగుతున్నాడు ఆమెను.

సత్యానందానికి సహనం- చచ్చిపోయింది.

క్రాస్‌వర్డ్ పజిల్‌లో ఒకమారు అక్షరాలు తలక్రిందులుగా ఇవ్వవలసి రావడం తప్పనిసరి అయిపోతుంది. తిరుగబడినా అదే అర్థాన్ని యిచ్చే 'కిటికీ', 'వికటకవి'లాంటిదికాదు గిరిజ. జీవితంలో తాను పక్కకు జరిగి ఇతరులకు చోటు ఇవ్వాలని చూస్తోంది. ఆ చోటులో కూర్చున్న మనిషి ఆమెను న్యూనత చేస్తున్నాడు.

ఆమెకు ఇలాంటి అనాదరం, అననుకూలత ఏర్పడడంలో తన బాధ్యత ఎంత? అన్నది సత్యానందానికి ఎప్పుడూ ఆలోచనీయాంశమే.

'నన్నేం చేయమంటావు? నా పుస్తకాలు- వాటిల్లో పరిజ్ఞానం తప్ప యింకేం పట్టదు. మనసుకు ఎక్కదు' అంటుంది గిరిజ.

సత్యానందానికి ఒక పక్క జాలి, ఒక పక్క సంతోషం- తను ఆ మనిషిని అవనందుకు.

జీవితంలో తప్పించుకు తిరగడమే ధన్యత అన్నసూక్తి గుర్తుకువస్తుంది అతనికి.

దేశంలో ఎన్నో ప్రదేశాలు ఒకచోట మండిపోతుంటే ఎండలు, మరో

చోట గోలగా వీస్తున్నాయి గాలులు. హోరున వానలు కురుస్తూ వుంటాయి. నేలకు నింగికీ అవినాభావ సంబంధాన్ని తీసుకువచ్చేది ఆ నీరు- ఈవాయువు రెంటినీ ఆవరించుకున్న తేజస్సే అనిపిస్తుంది. నీరు, నిప్పు మనిషిని ముంచి వేస్తాయి. మిగలకుండా చేస్తాయి.

అలాంటి మనిషి తన అస్తిత్వాన్ని గురించి ఎంత ధైర్యంగా, ఎంత తీరుబాటుగా ఆలోచిస్తూ వుండిపోతున్నాడు? ఇదేసత్యానం దానికి ఆశ్చర్యం, అద్భుతం అనిపించే విషయం.

పార్వతి, గిరిజ కాకపోతె మానె?

మరో 'ప్రఫుల్లముఖి' అయినా తనను అలరిస్తుందేమో అనుకున్నాడు. కాని ఎంత ప్రయత్నం చేసినా తనకు ఏంకావాలో, యేం అవసరమో అర్థం కాదు.

జీవితాన్ని దర్పణంలాగ చదువుకుని, అందులో తన రూపురేఖలు, విలాసాలు దిద్దుకోవాలనుకుంటాడు. దర్పణం చాల శుద్ధంగా వుంది. దాని మీద దుమ్ము, ధూళి లేవు. రూపాలు చక్కగా ఉన్నవి ఉన్నట్లుగా కని పిస్తున్నాయి.

దర్పణం తనకేమీ దర్పం తీసుకురావడం లేదు.

ఉన్న రూపును చూచుకుని భయం కలగడం లేదు.

బాధలు లేని జీవితం, భంగపాటు యెరగని జీవితం తనది. అందరినీ చూచి, అందరిగురించి ఆలోచించి, అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయడం తప్ప ఇంకేం పనిలేదు అనిపిస్తుంది తనకు.

ప్రయాణంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడడం తెలుసు. జీవితం కూడా ప్రయాణమే గదూ! వెళ్ళవలసిన చోటు అంటూ యేమీ లేక పోయినా, ప్రతిమనిషీ తాను ఉన్నచోటనే ఉండి విశ్వమంతా కలయతిరిగి రాగలుగుతున్నాడు. ప్రపంచమంతా తానే అయిపోతున్నాడు.

సత్యానందం ఆలోచన క్రమం యిది :

అందరూ వున్నారు. ఆనందంగానే వున్నామనుకుంటున్నారు;చూస్తున్న వాళ్ళకు మటుకు బహురూపాలలో కనిపిస్తున్నారు; జీవితంలో అందంగా ముందుకు వెడుతున్న సంగతి గమనించకుండా కూడా పరుగులు తీయగలుగు తున్నారు.

పార్వతి కావచ్చు, గిరిజ కావచ్చు, ప్రఫుల్లముఖి కావచ్చు. పేరులు రూపాలు వేరువేరు. వాళ్ళ గుణగణాలు, రూపలావణ్యాలు వేరు. సౌశీల్యంలో వాళ్ళ స్థాయి అనేక భేదాలలో వుండవచ్చును.

కాని అందరూ 'జీవితం అనే క్రాస్‌వర్డ్ పజిల్'లో ఆధారాలు పట్టుకుని వేలాడుతున్న వాళ్ళే!

ఆధారం చాల సన్నటి పొర. ఉండీ ఉండనట్లు, కనిపించీ కనిపించ నట్లు వుంటుంది. దాన్ని గట్టి చేసుకోవడం, గంభీర పరచుకోవడం సాధ్యం అయినట్లే కనిపిస్తుంది. సాధనం చేసిన కొద్దీ గట్టిపడుతుందితప్ప లేకుండా పోదు.

ఉన్నది– లేదు సన్నం- గట్టి.... ఇవన్నీ మనసుకు అనిపించేవేగాని నిజమో కాదో తెలియదు.

అందరూ ముందుకు జరిగి కూర్చుంటున్నారు.

ఫోటోలో రూపు సరిగా కనబడటానికి అన్నట్లు- సర్దుకు కూర్చుంటు న్నారు. ఫోటోగ్రాఫిక్ నెగిటివ్‌లో అందరి చిత్రాలు ముద్రితం అవుతున్నాయి. ఈ నెగెటివ్ మళ్ళీ పాజిటివ్ అవుతోంది. అబద్ధం నిజం అవుతోంది. అంతు తేలడం లేదు!

ఎక్కువగా ఆలోచించడం మంచివాడి లక్షణమో, ఉన్మత్తుడిలక్షణమో సత్యానందానికి యిదమిద్ధంగా తెలియదు. అసలు ఆలోచనకు, అంత రాయం కలిగించి వాటిని లేకుండా చేయడం ఎంత హాయి తీసుకువస్తుంది!

కనిపిస్తున్న ప్రతిదానితోనూ తాను సంబంధం పెట్టుకు కూర్చోవడం ఎందుకు? ఓ మనిషిని- గిరిజ అవనీ, పార్వతి అవనీ, ప్రఫుల్లముఖి అవనీ- ఎగరడం, ఆ ఎగరడమే సంబంధం! ఆ మనుషులు నిజంగా తనకు తెలియక పోతే- ఈ ప్రపంచంలో తనకు ఎంతమాత్రమూ తెలియని మనుషులు ఎందరులేరు గనుక! వాళ్ళకు యేం జరుగుతుందో. వాళ్ళ జీవితాలు సుఖాలే తీసుకువస్తున్నాయో, దుంఖాలే కూడగట్టుకు వస్తున్నాయో.... తనకు తెలియక పోతే ఇక ఆలోచించడానికి అవసరం యేముంది? ఒక వస్తువునో మనిషినో తెలుసుకోవడమే సంబంధానికి మొదలా? ఆ మనిషి పేరు, ఉద్యోగం,

సంసారం, అతని ఈతిబాధలు, మానసిక కల్లోలాలు- యివన్నీ ముందుకు వచ్చికూర్చుంటాయి- అతనితో పరిచయం కావడం తోటే. అతనితో పరిచయం కాకముందు అవన్నీ తనకు పట్టవు. పరిచయం కావడంతోటే పట్టి పల్లారుస్తాయి. ఇదేనా జీవిత న్యాయం?

సత్యానందానికి యిప్పటికి క్రాస్‌వర్డ్‌పజిల్‌లో దాదాపు అన్ని అక్షరాలు వచ్చేశాయి. ఇంకో రెండు మూడు అక్షరాలు దొరికితే చాలు- అంతా పూర్తయిపోతుంది: కాని విచిత్రం! ఇన్ని సంవత్సరాల నుంచి ప్రతిరోజూ ఉదయం అదే పనిగా కూర్చున్నా ఇప్పటివరకూ ఒక్కరోజు నయినా అన్ని అక్షరాలూ దొరికినాయి అన్న తృప్తి దొరకలేదు. ఎక్కడో ఒకచోట మొండి గోడ అడ్డువస్తూ వుండింది.

ఒక్కొక్కసారి ఆలోచించినకొద్దీ మెదడు- మనస్సు- మొద్దుబారి పోతాయి. మంచిరోజున అయితే ఇట్టే అయిదు నిముషాలలో ఆ రోజుకు దొరకవలసిన అక్షరాలన్నీ- పదాలన్నీ- దొరికిపోతాయి.

సత్యానందానికి మరో విచిత్రమైన పరిస్థితికూడా తారసపడింది. ఎంతకూ మాట దొరకదు, గడి ఖాళీగానే వుండిపోతుంది. ఆ రోజు అలాగే గడిచిపోతుంది. మరునాడు ఉదయం- కొత్త న్యూస్ పేపర్ రావడంతోటే ఆ మాట ఏమిటో, ఎందుకు తనకు నిన్ననే తెలిసిరాలేదో చూచుకుందాం అనిపించదు. ఆ ప్రసక్తే మనసులో ప్రశ్న వేసుకు కూర్చోదు.

కొత్త రోజులు, కొత్త పేపరు, కొత్త గళ్ళు, కొత్త ఆధారాలు, ఏ రోజుకు ఆ రోజు కొత్తదనం తీసుకువచ్చే 'క్రాస్‌వర్డ్ పజిల్' కంటే నిత్య నూతనమైన వస్తువు మరొకటి జీవితంలో యింకేం లేదు సుమా- అనిపిస్తుంది.

నిన్నటి సమస్యల బ్రాటోవర్ లేదు: బరువు క్రుంగదియ్యదు. ఈరోజు కొత్త సమస్య. దాని పరిష్కారంకోసం యాతన, తపన, ఆలోచన.ఆలోచన మొద్దుబారటం, తెగిపోవడం, అనంతంతో కలిసిపోయినట్లు అనిపించడం.

మళ్ళీ కొత్త రోజు, కొత్త పరిశ్రమ.

ఈ జీవితం ఎన్ని మహత్తర అవకాశాలను మన ముందు పరుస్తోంది! ఎంత నిదానంగా, తాపీగా, రికామీగా తనచేత పనిచేయించి ముందుకు తీసుకువెళుతోంది! ఈ కృషిలో ఎందరికి ఇతరుల సహకారం లభిస్తోంది. అందరి నుంచి ఎన్నెన్ని కొత్త విషయాలు తెలుసుకుని పొందికగా కూర్చు

కుంటున్నాము! అందరికీ ఋణగ్రస్తులమై పోతున్నాం గదా! ఈ ఋణం తీర్చుకోవడం మాటఏమిటి?- అని సత్యానందం కొత్తమలుపు తిప్పుకున్నాడు ఆలోచనను.

అన్నీ ఆలోచించడం అంత అవసరం లేని అవసరం.

ఆకాశంలోనుంచి నీటిధారలు పడుతూనే వున్నాయి.

అన్నీ సముద్రంలోకే వెడతాయా, నేల ద్వారానో- నది ద్వారానో అయినా?

నేలలో ఇంకిన నీరు పైకి ఉబికి రావలసిందేగా ఏ రోజు కయినా?

సత్యానందం విస్తృతంగా పరుచుకున్న ఆకాశం వంక చూచాడు. అతని మనస్సు అన్ని ఆధారాలనూ అధిగమించినట్లయింది,

✻